క్లుప్తంగా

18న సర్వసభ్య సమావేశం

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన ఈనెల 18న ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

రాష్ట్ర కోఆర్డినేటర్‌గా దుర్గారెడ్డి

చారకొండ: రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర కోఆర్డినేటర్‌గా మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన నారాయణ్ దుర్గారెడ్డి నియమితులయ్యారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ మంగళవారం దుర్గారెడ్డికి నియామక పత్రం అందజేశారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని దుర్గారెడ్డి పేర్కొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ గోదాం వద్దకు రైత వరిధాన్యం విక్రయించేందుకు తీసుకొచ్చాడు. అకస్మాతుగా వర్షం రావడంతో రైతు ఆందోళనకు గురయ్యాడు. దీంతో ఈవీఎం స్ట్రాంగ్‌రూం వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులు స్పందించి 5 క్వింటాళ్ల వరిధాన్యం వర్షానికి తడవకుండా రైతుకు సహకరించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని దగ్గరకు చేర్చి టార్పలిన్ కవర్ కప్పారు. అక్కడ ఉన్న రైతులు పోలీసులు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఉప్పునుంతల: మండల కేంద్రంలో మామిళ్ల తిర్పతయ్య మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.80 వేలు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, నాయకులు కొత్త చిన్న జంగిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీను, మల్లయ్య, శేఖర్‌గౌడ్, తిర్పతయ్యగౌడ్, మల్లయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



పెద్దకొత్తపల్లి: మారేడుమాందిన్నె గ్రామానికి చెందిన మాయని రాముడు ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మేకల గౌరవమ్మచంద్రయ్య మంగళవారం మృతుడి భార్యకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంగమ్మఅమ్మనాయర్, బాలునాయక్, బాలయ్య, గాల్‌రెడ్డి, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు చేపట్టాలి



చారకొండ: మండల కేంద్రంలో మహరాజుల కాలనీలో డ్రెయినేజీ పైపులు పగిలి మురుగు ఇండ్ల మధ్యలోనే ప్రవహిస్తోంది. దీంతో మంగళవారం కాంగ్రెస్ నాయకులు కేశమోని శంకర్ గౌడ్, చింతపల్లి వెంకటయ్య గౌడ్ డ్రెయినేజీని పరిశీలించారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి గణేష్ దృష్టికి తీసుకెళ్లారు. మరమ్మతు చేపట్టాలని కోరగా అధికారి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

పైపులను తొలగించండి



వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి గోవర్ధనగిరి నుంచి పెబ్బేరు పట్టణానికి వెళ్లే డబుల్‌బీటీ రోడ్డులో గోపల్‌దిన్నె క్రాస్ రోడ్డు సమీపంలోని కల్వర్టు వద్ద ప్రమాదకరంగా పైపులు నిల్వ చేయడంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. కల్వర్టులో నిర్మాణ పనులు చేపట్టేందుకు తెచ్చిన పైపులను రోడ్డుపై ఉంచడంతో రాత్రివేళలో వాహనదారులు ప్రమాదానికి గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయని సమీప గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు పనులను వెంటనే పూర్తి చేయించాలని కోరుతున్నారు.

భవన నిర్మాణం పూర్తయ్యేనా?

- తాత్కాలిక భవనంలో వసతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



అసంపూర్తిగా ఉన్న నూతన ఆస్పత్రి భవనం

వెల్దండ: ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యానికి ప్రాధాన్యం కల్పిస్తోంది. గత ప్రభుత్వం నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. మండల కేంద్రానికి పీహెచ్‌సీని మంజూరు చేసి నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ 2021 వసంవత్సరం డిసెంబర్‌లో భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. మొదట్లో పనులు చకచకా సాగిన కొన్ని నెలల తర్వాత పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండుళ్లు పూర్తయినా ఇప్పటికి ఆస్పత్రి నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కాంట్రాక్టర్లు అసంపూర్తిగా భవన నిర్మాణ పనులు చేసి వదిలేశారు. దీంతో రోగులకు కష్టాలు తప్పడం లేదు. గతంలో వెల్దండలో ఉన్న భవనం శిలాలావస్థకు చేరడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 2021 వ సంవత్సరం మే నెలలో మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలోకి తాత్కాలికంగా మార్చారు. ఏడాది కాలంలో కొత్త ఆస్పత్రి పూర్తి చేస్తాం, శిథిలావస్థలో ఉన్న భవనానికి మరమ్మతు చేస్తామని గత పాలకుల హామీలకే పరిమితం అయ్యారు. తాత్కాలికంగా ఉన్న ఆస్పత్రిలో వైద్యులు ఇబ్బందులు పడుతు రోగులకు వైద్య సేవలందిస్తున్నారు.

మహిళ రోగులకు తప్పని ఇబ్బందులు

మండలంలో అధికంగా గిరిజనతండాలు ఉన్నాయి. ప్రతి రోజు ఆస్పత్రికి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. సాధారణంగా 150 నుంచి 200 మంది వరకు వైద్యులు ఓపీ చూస్తున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. మహిళ రోగులకు సరైన వసతులు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులు, కల్వకుర్తి, ఆమనగల్లు పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. గర్భిణులు నరకయాతన అనుభవిస్తున్నారు. నీటి వసతి, కాన్పుల గదులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. తప్పనిసరి స్థితిలో నెలకు ఒకటి లేదా రెండు వరకు కాన్పులు చేస్తున్నారు. ప్రసవాల కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి రేఫర్ చేస్తున్నారు.

రూ.50 లక్షలతో ..

నాణ్యమైన వైద్యం అందించేందుకు గత ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ.50లక్షల నిధులను మంజూరు చేసింది. దీంతో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు స్లాబ్, గోడల వరకు నిర్మించి నిధుల కొరతతో పనులను నిలిపివేశారు.

దీంతో రోగులకు నాణ్యమైన వైద్యం అందడం కష్టంగా మారింది. హైదరాబాదు-శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రమాదాలబారిన పడినవారు మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు లేకపోవడంతో కల్వకుర్తి, ఆమనగల్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి అసంపూర్తిగా భవనాన్ని పూర్తి చేసి రోగులకు వినియోగంలో తీసుకురావాలని మండల ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



తాత్కాలికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మౌలిక వసతులు లేవు. వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నాం. పక్కా భవనం నిర్మించాలి. రోగులకు, వైద్యులకు వసతులు కల్పించేందుకు అవకాశం ఉంటుంది. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి త్వరగా భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

–జంగయ్య, చొక్కన్నపల్లి

ప్రసవాల సంఖ్య తగ్గుతోంది



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతం కంటే ప్రసవాల సంఖ్య తగ్గింది. తాత్కాలిక భవనంలో తాగునీరు సౌకర్యం, పరీక్షలకు, తదితర సమస్య నెలకొంది. ఆస్పత్రిలో గదులు సరిపోవడం లేదు. మహిళలను ప్రసవాల కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తున్నాం. సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–స్వరూప, డాక్టర్, వెల్దండ

భక్తిశ్రద్ధలతో దీపారాధన



ఆలయంలో దీపారాధన చేస్తున్న పూజారి

తాడూరు: మండల కేంద్రంలోని కొమ్ముగుట్ట ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే పడిపూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త అనుపటి శ్రీనివాసులు, పూజారి పుచ్ఛ అనురూప్‌శర్మలు తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణాన్ని శుభ్రం చేసి దీపారధన చేశారు. బుధవారం ఆలయ రెండో వార్షికోత్సవ మహాపడిపూజా బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. అన్నదానం చేస్తునట్లు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం



మల్లీశ్వరి

తెలకపల్లి: మహిళ అదృశ్యమైన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్నముద్దునూర్ గ్రామానికి చెందిన పాశం మల్లీశ్వరి(26) నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సీఎస్ఆర్ స్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వహిస్తుంది. ఈ నెల 1వ తేదీ హైదరాబాద్‌లో ఉంటున్న అక్క దగ్గరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. ఇప్పటి వరకు తిరిగి రాలేదు. బాధిత కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలువలేదు. మహిళా సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ అమానుషం

ఆత్మకూర్: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అమానుషమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆత్మకూర్ మండల అధ్యక్షుడు రియాజుద్దీన్, ప్రధానకార్యదర్శి ఆదం, ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, కోశాధికారి రాజు మండిపడ్డారు. నారాయణఖేడ్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం రెమ్యూనేషన్ చెల్లించాలని కోరడంతో ఆర్డీఓ పోలీసులతో లాఠీచార్జ్ చేయించడం దారుణమన్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేపడుతామన్నారు.

గెలుపోటములపై నాయకుల అంచనాలు

లింగాల: పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ సరళిని ఆయా పార్టీల నాయకులు నిశితంగా గమనిస్తున్నారు. అభ్యర్థులు నాయకులు, కార్యకర్తలతో చర్చిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికకు, లోక్‌సభ ఎన్నికకు ఓటింగ్ శాతంపై అంచనాలు వేస్తున్నారు. ఈ సారి మండలంలో బీజేపీ ఓటు బ్యాంక్ పెరిగినట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ఓటర్లు బీజేపీ వైపు మళ్లినట్లు పలువురు భావిస్తున్నారు. కేంద్రంలో బీజేపీ పార్టీ మాత్రమే సుస్థిర పాలన అందిస్తుందని నమ్మకంతో ఓటర్లు, ముఖ్యంగా యువ ఓటర్లు బీజేపీకే మద్దతు తెలిపినట్లు సమాచారం. కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్యనే ప్రధాన పోటీ కొనసాగినట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు



తాడూరు శివారులో దుక్కి దున్నుతున్న రైతు



యాదిరెడ్డిపల్లి శివారులో దుక్కి చదును చేసిన రైతు

తాడూరు: వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలు ఉంటాయి. సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుంది. తద్వార భూసార అభివృద్ధికి తోడ్పడుతోంది. కలుపు మొక్కలు, చీడపీడలను నివారించవచ్చు. పంటకాలం ముగిసాక భూములను ఖాళీగా ఉంచడంతో పంటలను ఆశించే చీడపురుగులు తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. అవి భూమిలో పోషకాలు స్వీకరించడమే కాకుండ భూమిలోపలి పొరల నుంచి నీటిని లాగుతాయి. దీంతో భూమిలోని సారం దెబ్బతిని వానాకాలం పంటల సాగుపై ప్రభావం పడుతుంది. ప్రమాదాన్ని నివారించడానికి రైతులు యాసంగి పంటలు చేతికి అందగానే దుక్కులను దున్ని భూములను ఆరబెట్టాలని వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు చేస్తున్నారు. రైతులు ఈ పద్ధతి పాటించి వానాకాలంలో మంచి ఫలితాలు సాధించాలని కోరుతున్నారు.

భూసారం పుష్కలం

వేసవి దుక్కులు లోతుగా వాలుగా, అడ్డంగా దున్నుకోవడం ద్వారా వర్షపునీరు భూమిలోకి ఇంకేందుకు అవకాశం ఉంటుంది. భూమి కూడ ఎక్కువ తేమ గ్రహించి నిలువ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. వేసవి దుక్కులు దున్నేముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడంతో అవి విసర్జించిన వ్యర్థాలు భూమిలోకి చేరి సేంద్రియ పదార్థం తయారుఅవుతోంది. ఫలితంగా భూసార వృద్ధిలో ఎంతగానో ఉపయోగపడుతోంది. సాధారణంగా రైతులు పంట చేతికి అందగానే పంటలనుంచి వచ్చే ఎండుఆకులు, ఎత్త కాల్చివేయకుండా అవకాశం ఉన్నవారు లోతు దుక్కులు చేయడం మూలంగా పంట చెత్తాచెదారం ఎండు ఆకులు నేల పొరల్లో కలిసిపోయి ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది. పంటకు కావాల్సిన పోషకపదార్థాలు పుష్కలంగా లభిస్తాయి.

చీడపీడలకు చెక్

వేసవి లోతు దుక్కుల వలన నిద్రావస్థ దశలో భూమిలోని చీడపురుగుల కోశాలు, గుడ్లు, లార్వాలు, గుడ్లను పక్షులు, కాకులు తిని వాటిని నాశనం చేస్తాయి. పొరల్లో శిలీంద్రాలు మట్టితో పాటు నేలపైకి వస్తాయి. బయట అధిక ఉష్ణోగ్రతలకు చనిపోతాయి.

లాభాలు ఎన్నో..

వేసవి కాలంలో రైతులు పంట కోత అనంతరం పొలాన్ని కాలిగా వదిలేస్తుంటారు. దీంతో తొలకరి వానలు పడగానే నీరు భూమిలోకి ఇంకిపోకుండా బయటకు వెళ్తోంది. వర్షాలకు ముందు భూమిని దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండ ఉంటుంది. లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందకు కింద పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. ఇలా భూమిలో తేమశాతం పెరిగి భూసారం అభివృద్ధి, పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, కలుపుమొక్కల నివారణ వంటి ప్రయోజనాలు సమకూరుతాయి. వేసవి దుక్కులు దున్నేముందు పశువులు పెంటపోగు కంపోస్టు, ఎరువు మట్టిని వెదజల్లడం ద్వార సారవంతమైన పంట దిగుబడితోపాటు తేమశాతం మరింత పెరుగుతుంది. లోతుగా దుక్కి దున్ని తొలకరి వర్షాలకు గొర్రు తిప్పి గుంటకలతో సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరిస్తాయి.

అవగాహన కల్పించాలి



గ్రామాలలో రైతులకు అధికారులు అవగాహన కల్పించాలి. వ్యవసాయ అధికారులు రైతులు సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి చైతన్యం చేయాలి. వేసవి దుక్కులపై రైతులకు అవగాహన ఉండదు.

– బాల్‌వెంటకయ్య, రైతు, ఆకునెల్లికుదురు

అధికారుల సలహాలు పాటించాలి



వేసవిలో దుక్కులు దున్నుకోవడంతో రైతులకు వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయి. లోపలికి దున్నుకునేందుకు రైతులు కృషి చేయాలి. సేంద్రియ ఎరువులను ఉపయోగించాలి. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి.

–సాయిరమేష్‌కుమార్, ఏఓ

ఘనంగా భగీరథుడి జయంతి



కల్వకుర్తిలో భగీరథునికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం



తెలకపల్లిలో..

కల్వకుర్తిరూరల్: భగీరథ మహార్షి జయంతి వేడుకలు మంగళవారం సగరసంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని విద్యానగర్‌లో ఉన్న భగీరథ మహార్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఇద్దరు చిన్నారులు పరమశివుడి వేషధారణతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా భగీరథ మందిర అధ్యక్షుడు కొడకంటి వివేకానంద మాట్లాడుతూ భగీరథ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సగర సంఘం గౌరవ అధ్యక్షుడు భీమయ్య, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఉపాధ్యక్షుడు దుర్గయ్య, హరికృష్ణ, సురేష్, రవిందర్ పలువురు పాల్గొన్నారు.

తెలకపల్లి: భగీరథ మహార్షి స్ఫూర్తితో ముందుకు సాగుదామని ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో భగీరథ మహార్షి జయంతిని మండల సగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. భగీరథ మహార్షి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సగర కులస్తులు ఐక్యంగా ఉండాలని కోరారు. సగరసంఘం నాయకులు నర్సింహ, బాబుసాగర్, పోతుల పల్లి రాములు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై అసత్యప్రచారం సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాయినగర్ కాలనీలో కౌన్సిలర్ ఇంటిపై జరిగిన సంఘటన పూర్తిగా అక్కడ ఉన్న వారి వ్యక్తిగత కారణాలతో జరిగిందని, కాంగ్రెస్‌పై బురదజల్లడం సరైంది కాదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అడపాల గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాసులు, సీనియర్ నాయకులు కపిలవాయి చంద్రమోహన్, హరిశ్చంద్ర అన్నారు. మంగళవారం రాత్రి అచ్చంపేటలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాయినగర్‌లో జరిగిన సంఘటనకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. బీఆర్ఎస్ గుండాలు కొంతమంది కావాలని కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అవాస్తవాలు చెప్పడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖాదర్, లింగంయాదవ్ పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనం అగ్నికి ఆహుతి



కాలిపోయిన మొక్కలు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో పల్లెప్రకృతి వనంలో పెంచిన మొక్కలు అగ్నికి ఆహుతయి కాలిపోయిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం పల్లెప్రకృతి వనానికి సమీపంలో ఉన్న కాల్వలో గుర్తు తెలియని వ్యక్తులు జమ్ముకు నిప్పు పెట్టడంతో నిప్పురవ్వలు ఎగిసిపడి పల్లె ప్రకృతివనంలోని మొక్కలకు అంటుకున్నాయని తెలిపారు. దీంతో పండ్లు, పూల మొక్కలు కాలిపోగా గ్రామ పంచాయతీకి చెందిన బోర్ మోటార్, వైర్లు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పడిపోయిన మామిడి ధర



పెద్దకొత్తపల్లి మార్కెట్‌కు మామిడి కాయలు విక్రయించేందుకు తీసుకొచ్చిన రైతులు

పెద్దకొత్తపల్లి: ఒక్కసారిగా మామిడి ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మామిడి కొనుగోలు కేంద్రాలలో వ్యాపారులు తక్కువ ధరలకే మామిడి కాయలను కొనుగోలు చేయడంతో రైతులు నష్టాలపాలవుతున్నారు. కేజీ రూ.30 నుంచి రూ.40 లకు కొనుగోలు చేసే వ్యాపారులు ప్రస్తుతం కేజీ రూ.10 నుంచి రూ.20 కే కాయలను కొంటున్నారని రైతులు వాపోయారు. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి తక్కువ ధరకే మామిడికాయలను కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.

మరమ్మతుకు నోచుకోని బీటీ రోడ్డు



దెబ్బతిన్న తాడూరు- ఉప్పునుంతల రోడ్డు

ఉప్పునుంతల: మండల కేంద్రం నుంచి తాడూరు వరకు ఉన్న బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు కమ్మేసుకోవడంతో పాటు కొన్ని చోట్ల బీటీ పూర్తిగా లేచిపోయింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల వద్ద చెట్లు కమ్ముకొని ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించడం లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం నుంచి ఈ రోడ్డు మార్గంలోనే పెనిమిళ్ల వరకు పలు గ్రామాలకు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఏడేళ్ల కిందట బీటీ రోడ్డు నిర్మించారని నిర్వహణ లోపంతో రోడ్డు దెబ్బతిందని పలు గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ భవనం



ఆకునెల్లికుదురులో కమ్యునిటీ భవనం

తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురులో పదేళ్ల కిందట రూ.5 లక్షల వ్యయంతో కమ్యూనిటీ భవనం నిర్మించారు. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన కమ్యునిటీ భవనానికి తాత్కాలిక మరమ్మతు వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రత్నగిరి ఫౌండేషన్‌తో సేవా కార్యక్రమాలు



సమ్మర్ క్యాంపులో టేబుల్ టెన్నిస్ ఆడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్థాపించిన రత్నగిరి ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమ్మర్ క్యాంపును బుధవారం సందర్శించి, విద్యార్థులకు ఇస్తున్న శిక్షణపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ ఆడారు. క్యాంపులో ఏర్పాటుచేసిన క్రీడా వసతులపై ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజతో మంత్రి చర్చించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యాంపు నిర్వహణ చేపట్టాలని సూచించారు. రత్నగిరి ఫౌండేషన్ ద్వారా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలతో పాటు యువతకు ఉపాధి శిక్షణ, విద్యార్థులకు విద్య, క్రీడాపరమైన సౌకర్యాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. మంత్రి వెంట ఆయన సోదరుడు జగన్మోహన్‌రావు, కౌన్సిలర్లు బాలస్వామి, నయూం, నాయకులు మేకల సాయిలు యాదవ్, బిజ్జ రమేష్, బాబా, ఖాద్రీ, మల్లయ్య ఉన్నారు.